మంచినీటి సమస్యను తీర్చండి


సీపీఎం నాయకులతో కలిసి తాగునీటి సమస్యను వ్యక్త పరుస్తున్న పిండిలోవ గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలస పంచాయతీ పిండిలోవ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సీపీఎం నాయకుడు పి. రాము అన్నారు. గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన మోటారు దూరంగా ఉండడంతో ట్యాంకు నింపేందుకు చాలా ఆలస్యం అవుతోందని ఈ కారణంగా ఎక్కిన కొద్దిపాటి నీరు గ్రామంలో ఉన్న గిరిజనులకు సరిపడడం లేదని గ్రామంలో ఉన్న రెండు హ్యాండ్ బోర్లలో నుంచి బురదనీరు రావడంతో తాగునీటికి పిండిలోవ గ్రామస్తులు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను గ్రామానికి పంపించి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.మోసకొండ, జి.చింతామణి, ఎం.లక్ష్మి తదితరులు ఉన్నారు.

గిరిజన గ్రామాలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలి

మండలంలో ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు తమ గ్రామాల నుంచి మైదాన ప్రాంతాలకు వచ్చి రేషన్ షాపుల వద్ద రేషన్ బియ్యాన్ని తీసుకుని తలపై బరువుతో కిలోమీటర్ల మేర మోసుకుంటూ వారి గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర వ్యయ ప్రయాసలతో అవస్థలు పడుతున్నారని పార్వతీపురం మండల సీపీఎం అధ్యక్షుడు పి. రాము అన్నారు. మండలంలోని ములగ, గంగాపురం పంచాయతీలకు సంబంధించి గిరిజన గ్రామాలను మంగళవారం పరిశీలించిన ఆయన ఎండీయూ వాహన డ్రైవర్, స్థానికులతో కలిసి మాట్లాడుతూ గత ప్రభుత్వం మంచి ఆలోచనతో ఇళ్లవద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దుచేసి గిరిజనులు 5 నుంచి 6కిలోమీటర్ల దూరం నడిచి రేషన్ షాపులకు వెళ్లి వచ్చేలా అవస్థలకు గురిచేస్తోందన్నారు. గిరిజన గ్రామాలకైనా ఎండీయూ వాహనాల ద్వారా సరఫరాలను పునఃప్రారంభించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ప్రభుత్వం దృష్టికి క్షేత్రస్థాయి సమస్యలు

- అరకు ఎంపీ గుమ్మ తనూజా రాణి


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: క్షేత్రస్థాయిలో గల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేలా చూస్తానని అరకు ఎంపీ గుమ్మ తానూజా రాణి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రానికి మంగళవారం వచ్చిన ఆమెతో వైఎస్సార్‌సీపీ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి మాజీ శాసనసభ్యుడు అలజంగి జోగారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ ప్రాంతానికి వచ్చిన ఎంపీని పూలమాలలు, శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జోగారావు గ్రామాల వారీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులను పరిచయం చేసి వారి గ్రామాల్లో ఉన్న సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె దృష్టికి వచ్చిన సమస్యల్లో ప్రధానంగా పలు సీసీ రోడ్లు, కాలువలు, అభివృద్ధి భవనాల నిర్మాణం, తాగునీరు, సాగునీరు సరఫరా వంటి పలు పనులు పూర్తి చేశామని, ఇంకొన్ని మధ్యస్థంగా ఉన్నాయని అయితే వాటికి ఇంతవరకు ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తన ప్రయత్నంగా చొరవ తీసుకుని న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం


మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఎ.డి డాక్టర్ శ్రీనివాసరావు

సీతానగరం: ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, అనివార్యమే అయినా విధి నిర్వహణలో వారు చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పశు సంవర్ధకశాఖ సీతానగరం ఎ.డి బి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక సబ్‌డివిజన్ ఆస్పత్రిలో సహాయ సంచాలకుడిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన డాక్టర్ చింతాడ దీనకుమార్, సిబ్బందిని సబ్‌డివిజన్ మండలాల పశువైద్యాధికారులు, సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీత డాక్టర్ దీనకుమార్ మాట్లాడుతూ పశువైద్యులు, సిబ్బంది సహకారంతో దీర్ఘకాలం పనిచేసేభాగ్యం లభించిందన్నారు. కార్యక్రమంలో పార్వతీపుం మండల పశువైద్యాధికారి చక్రవర్తి, డాక్టర్ సంతోష్‌కుమార్, గ్రామీణ పశువైద్యాధికారులు, పశువైద్య సహాయకులు, గోపాల మిత్రలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కాలువలకు మరమ్మతుల్లేవా?

- ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి


గుర్రపుడెక్కతో నిండి ఉన్న జంఝావతి కాలువను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

పార్వతీపురం/పార్వతీపురం టౌన్: కోట్ల రూపాయల విలువైన సంపదను కార్పొరేట్లకు ఉచితంగా అందించి రైతులకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన మంగళవారం పార్వతీపురం పరిధిలోని జంఝావతి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తోటపల్లి, పెద్దగెడ్డ, జంఝావతి, వెంగళరాయ ప్రాజెక్టుల కాలువలకు మరమ్మతులు నిర్వహించకపోతే సాగునీరు ఎలా సరఫరా అవుతుందని ప్రశ్నించారు. కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, పూడికలు తొలగించక, మదుములు, షట్టర్లకు మరమ్మతులు చేయకపోతే సాగునీరు సరఫరా ఎలా అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తోటపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ ఆధునికీకరణకు, ప్రాజెక్టు నిర్వహణకు బడ్జెట్‌లో ఒక్క రూపాయికూడా కేటాయించకపోవడం విచారకరమన్నారు. కోట్ల సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేసి రైతులకు సాగునీటిని అందించకపోవడం ద్రోహం కాదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు రైతు సంఘ ఉపాధ్యక్షుడు బంటు దాసు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి బాబు మోసాలపై ఇంటింటి ప్రచారం


నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలపై ఈ నెల 21 నుంచి ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ ఇంటింటి ప్రచారం ద్వారా బాబు చేస్తున్న మోసాలు వివరించనున్నామన్నారు. 12 రోజుల పాటు వార్డుల్లో ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. ఈ నెల 17న పురపాలక స్థాయి విస్తృత సమావేశం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు చందాన ఆనంద్, బీసీసెల్ అధ్యక్షులు గొర్లె మాధవరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు, ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన రమాదేవి


వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో భేటీ అయిన రంగుముద్రి రమాదేవి

పార్వతీపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మాజీ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ డా.రంగుముద్రి రమాదేవి ఆమె భర్త గణపతిరావు మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు జగన్‌మోహన్ రెడ్డికి నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన వారిలో రంగుముద్రి శివ నరేంద్ర నాయుడు తదితరులు ఉన్నారు.

వార్డు 19వ వార్డు కౌన్సిలర్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


కౌన్సిలర్ బోదయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ తెలుగు బోదయ్య ఇటీవల ప్రమాదవశాత్తు జారిపడి గాయపడిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం ఆయనను పరామర్శించారు. కార్యకర్తలు, నాయకులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొరత లేకుండా ఎరువుల సరఫరా

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్


పెదమరికిలో ఎరువులు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్

పార్వతీపురం రూరల్: జిల్లాలోని ప్రతి రైతు సేవా కేంద్రంలో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచి ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మండల వ్యవసాయశాఖ అధికారి అశోక్‌తో కలిసి పెదమరికి పంచాయతీలో యూరియా సరఫరా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 180 రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా డీఏపీ, యూరియా, పొటాష్ తదితర ఎరువులు రైతులకు అందించేందుకు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో స్థానిక గ్రామీణ వ్యవసాయ అధికారి రావుపల్లి ఇందిర, తదితరులు ఉన్నారు.

శిక్షణ వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న నిర్వాహకుడు నాగేశ్వరరావు

సీతానగరం: పీఎం స్కూల్స్‌లో విద్యనభ్యశిస్తున్న విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను వినియోగించు కోవాలని ఎస్ఓ నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట కేజీబీవీ కాలేజీ ఆవరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ 5 రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో లైఫ్ స్కిల్ అభివృద్ధి, అత్యవసర పరిస్థితుల్లో సమస్యను ఎదుర్కోవడం, ప్రథమ చికిత్స చేయడం, ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై 40 మంది విద్యార్థులు, 36 మంది బాలికలకు శిక్షణ ఉంటుందన్నారు.కార్యక్రమంలో ఏఎస్ఓలు నారాయణమూర్తి, చిన్నంనాయుడు, విజయ కుమార్, శిక్షకులు చిన్నంనాయుడు, రజియా బేగం, జె.నరసింహ స్వామి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల నిరసన


కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

- పెన్షన్ వేలిడేషన్ అమెండ్‌మెంట్ రద్దు చేయాలని డిమాండ్

పార్వతీపురం టౌన్: పెన్షన్ వేలిడేషన్ అమెండ్ మెంట్ రద్దు చేయాలని ఏపీ పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంట జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆదేశాలతో మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ అమెండ్‌మెంట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్ నష్టపోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో 12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణమే నియమించాలని, ఐఆర్ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ప్యాకేజీ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డి.గణపతి రావు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

లీడర్ రిపోర్టర్‌కు నివాళులు


గర్భాపు నాగేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, లీడర్ రిపోర్టర్ గర్భాపు నాగేశ్వరరావుకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మంగళవారం నివాళులు అర్పించారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో నాగేశ్వరరావు సోమవారం హఠాణ్మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాజన్నదొర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం పట్టణంలోని డబ్బీవీధిలో ఉన్న నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. నాగేశ్వరరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడ ల్ పాఠశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్వర్ణలత ఆధ్వర్యంలో వరల్డ్ యూత్ స్కిల్స్‌డే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాచరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, వివిధ కళలపై మక్కువ చూపించాలని పిలుపునిచ్చారు. యువతకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ఏటా జూలై 15వతేదీన ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి 2014లో నిర్ణయించిందన్నారు. ఉద్యోగాలు, వ్యవస్థాపకతకోసం యువకులు నైపుణ్యంతో సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా అమ్మవారు


శాకంబరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

సాలూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో ఓ మంగళవారం ఈ విధంగా అమ్మవారిని కాయగూరలతో శాకంబరిగా అలంకరించనున్నట్లు అర్చకుడు హేమంత్‌శర్మ తెలిపారు.

జీఓ 3 ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలి

- గిరిజన సంఘం నాయకులు


సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ, గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం: షెడ్యూల్ ఏరియాలో శత శాతం ఉపాధ్యాయ పోస్టులను జీఓ నంబర్ 3 ప్రకారం అమలు చేయాల్సిందేనని ముక్త కంఠంతో గిరిజన సంఘం నాయకులు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం గిరిమిత్ర భవనంలో ఐటీడీఏ పీఓ అశుతోస్ శ్రీవాస్తవ గిరిజన సంఘం నాయకులు, ఉపాధ్యాయ సంఘ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీఓ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జీఓ నంబర్ 3, గిరిజన చట్టాల అమలుపై గిరిజన సంఘాల నాయకులతో సమీక్షించాలని రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఎస్.భార్గవి ఆదేశాలమేరకు సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. షెడ్యూల్ ఏరియాలో జీఓ 3 ప్రకారం శత శాతం ఉపాధ్యాయ పోస్టును కేటాయించాలని గిరిజన సంఘం నాయకులు అభిప్రాయం వ్యక్తం చేయగా, సుప్రీంకోర్టు నిబంధనలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని పీఓ అభిప్రాయ పడ్డారు. గిరిజన సంఘం నాయకులు వ్యక్తంచేసిన అభిప్రాయాలను రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు నివేదించనున్నట్లు పీఓ తెలిపారు. ఈ సమీక్షలో గిరిజన సంఘం నాయకులు నిమ్మక జయరాజ్, పాలక రంజిత్‌కుమార్, పల్ల సురేష్, తాడంగి సాయిబాబు, ఇంటికుప్పల రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్, బిడ్డిక తమ్మయ్య, జలుమూరి మణికుమార్, ఆరిక విప్లవ కుమార్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

17న గిరిజన సంక్షేమశాఖ సంచాలకురాలి రాక

ఈనెల 17న రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ సంచాలకురాలు ఎస్.భార్గవి జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 10.30 గంటలకు స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు, గిరిజన సంఘాలు, న్యాయవాదులు, ఎన్జీఓలు, ఇతరులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి 'మోడల్' విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్వర్ణలత

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్‌పాఠశాలలో పదవతరగతి చదువుకున్న బి.రవికుమార్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్వర్ణలత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవికుమార్‌కు ఈఏడాది పదవతరగతి ఫలితాల్లో 569మార్కులు వచ్చాయని చెప్పారు. రెండవ విడత కౌన్సెలింగ్‌లో రవికుమార్ ట్రిపుల్‌ఐటీలో అర్హత సాధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థి రవికుమార్‌ను ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు దుశ్శాలువాతో సత్కరించి, మెమెంటోను అందజేశారు.

చెత్తను బళ్లలోనే వేరు చేయాలి


పెదభోగిలిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: గ్రామాల్లోని క్లాప్‌మిత్రలు ప్రతి రోజూ ఉదయం ఇంటింటా సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీల్లో శుద్ధి చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి పంచాయతీలో మంగళవారం చెత్తసేకరణ, పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కాశీపేట, చినభోగిలి గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణపై ఆరాతీసారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జంఝావతి కాలువ ద్వారా నీరు విడుదల


జంఝావతి కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్న రమణ తదితరులు

పార్వతీపురం రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామ వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు గోపాలపురం సర్పంచ్ పెండ స్రవంతి, రమణ, స్థానిక లష్కర్‌తో కలిసి జంఝావతి కాలువ ద్వారా సాగునీటిని మంగళవారం విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా గోపాలపురం, పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస పంట పొలాలతోపాటు అడ్డాపుశీల, పిన్నింటిరామినాయుడువలస, బాలుగడబ, తదితర గ్రామాలకు సంబంధించిన పంట పొలాలకు నీరు అందనున్నట్లు వారు తెలిపారు.

జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి


మునిసిపల్ మేనేజర్ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కువైందని ఇది చాలా దారుణమైన పరిస్థితి అని సీపీఎం పార్వతీపురం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, సురేష్, కృష్ణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


చర్చల్లో పాల్గొన్న హైర్ బస్సు డ్రైవర్లు, యజమానులు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం లేబర్ కమిషనర్ సువర్ణతో లేబర్ ఆఫీసులో చర్చలు జరిపారు. హైర్ బస్సు యజమానుల తరపున రవీంద్రరెడ్డి, మరో ఇద్దరు హాజరయ్యారు. సీఐటీయూ తరపున జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు యూనియన్ ట్రెజరర్ ఎస్.మన్మథరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.